క్లుప్తంగా

పెదకొండూరులో స్వచ్ఛ భారత్

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలంలోని పెద్ద కొండూరు గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కనక పుట్లమ్మ తల్లి దేవస్థానంలో గురువారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు దానబోయిన వెంకట శివాజీ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు స్వచ్ఛ అభయాన్ కార్యక్రమంలో భాగంగా ఆలయం శుభ్రం చేసి, చుట్టూ ఉన్న చెత్తను తొలగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెలవెల సాంబశివరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

మంగళగిరి: నగరంలోని నృసింహస్వామి ఆలయం వద్ద ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తెలిపారు. గురువారం ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి కార్యాలయంలో అధికారులు ఎమ్మెల్సీ హనుమంతరావు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ట్రాఫిక్ నియంత్రణకు పలు సూచనలు చేశారు. ఆలయానికి ఇరువైపులా ప్రత్యేకంగా ప్రైవేటు సెక్యూరిటీని నియమించి, భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఆలయం ఎదుట మార్కింగ్ చేసి, వాహనాలు పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రపంచ దార్శనికుడు అంబేడ్కర్


మాట్లాడుతున్న సమన్వయకర్త గంజి చిరంజీవి, ఎమ్మెల్సీ హనుమంతరావు..


మంగళగిరిలో భారీ ర్యాలీ..

మంగళగిరి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పేదరిక నిర్మూలనే ధ్యేయంగా రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలిస్తున్నారని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కొనియాడారు. అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్న నేపథ్యంలో మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం సామాజిక మహా న్యాయ శిల్పం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం నుంచి ప్రారంభమైన సంతకాల సేకరణ ర్యాలీలో ఎమ్మెల్సీతో పాటు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త గంజి చిరంజీవి, నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, నగర కమిషనర్ నిర్మల్ కుమార్ పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహం సెంటర్ వద్ద నాయకులు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేశారన్నారు. అణగారిన వర్గాల కోసం పోరాడిన మహనీయుడన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వారసత్వాన్ని స్మరించుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.404 కోట్లతో 206 అడుగుల విగ్రహంతో పాటు స్మృతి వనం నిర్మించడం ప్రపంచానికే ఆదర్శమన్నారు. శుక్రవారం విజయవాడలో జరిగే అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ, స్మృతివనం జాతికి అంకితం చేసే కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ హేమామాలిని, డిప్యూటీ కమిషన్ శివారెడ్డి, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదుల మూడి డేవిడ్ రాజు, తాడేపల్లి పట్టణ ఎస్సీ విభాగం అధ్యక్షుడు ముదిగొండ ప్రకాష్ కోరారు. గురువారం తాడేపల్లిలోని కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించున్నారన్నారు. ఈ వేడుకకు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

మహోన్నత ఘట్టానికి అడుగులు



తాడికొండ: విజయవాడ వేదికగా ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో మహోన్నత ఘట్టానికి అడుగులు పడనున్నాయని మాజీ హోం మంత్రి, ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేకతోటి సుచరిత అన్నారు. సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయమే పరమావధిగా స్వరాజ్ మైదానంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 206 అడుగుల సామాజిక శిల్పం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్నారన్నారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం అందించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్నతో కలిసి అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ వేడుకలో పాల్గొనేందుకు అందరినీ ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. తాడికొండ నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో అందరూ కులమతాలకు, పార్టీలకు అతీతంగా ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

నేతన్నలకు న్యాయం చేసిన ఏకైక నాయకుడు సీఎం జగన్

- చేనేతలంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలి
- బీసీలకు చట్టం తెస్తామన్న లోకేష్ బీసీల సీటు లాక్కొంటున్నారు..
- బీసీ సంకల్ప సభలో ధ్వజమెత్తిన నాయకులు



మాట్లాడుతున్న కేశన శంకరరావు

మంగళగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పద్మశాలీయులకు రెండు ఎమ్మెల్సీ, ఒక ఎంపీ సీటును కేటాయించి బీసీల పట్ల ఉన్న ప్రేమను నిరూపించుకున్నారని, బీసీ సంక్షేమ సంఘం నాయకులు కొనియాడారు. నగరంలోని రత్నాల చెరువులో గురువారం బీసీ సంకల్ప సభ నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధక్షుడు పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. అసెంబ్లీ స్థానాలు మంగళగిరి, ఎమ్మిగనూరు, కదిరిని పద్మశాలీయులకు ముఖ్యమంత్రి కేటాయించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని నేతన్నలు ఆయనకు అండగా నిలుస్తారన్నారు. బీసీ చట్టం తెస్తానన్న లోకేష్ బీసీలు అత్యధికంగా ఉన్న మంగళగిరి సీటు లాక్కోవడమేనా.. తెచ్చే చట్టం, అజండా అని నిలదీశారు. చంద్రబాబు, లోకేష్ దుర్మార్గపు చర్యలను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ సామాజిక వర్గాలు గమనిస్తున్నాయన్నారు. కుట్రలను బీసీలంతా ఐక్యంగా తిప్పికొడతామన్నారు. బీసీ సంకల్ప సభ అజండాను ప్రకటించారు. తమ న్యాయమైన కోర్కెలు తీర్చే పార్టీలకే రానున్న ఎన్నికలలో బీసీలంతా అండగా ఉంటారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, డైరెక్టర్ పారేపల్లి విజయలక్ష్మి, ఆరికటిక కార్పొరేషన్ డైరెక్టర్ శివరామ్ బాబాజీ, సంఘం నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ షహేలా నర్గీస్


మాట్లాడుతున్న ఎంపీపీ షేక్.షహేలానర్గీస్

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు ఎంపీపీ షేక్.షహేలా నర్గీస్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ షేక్.షహేలా నర్గీస్ అధ్యక్షత వహించి, మాట్లాడారు. పలు గ్రామాల్లో మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రోడ్ల నిర్మాణం, తాగునీటి ఎద్దడి నివారణకు బోరు పంపులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జగనన్న కాలనీల్లో బోర్లు ఏర్పాటు చేశామన్నారు. అభివృద్ధి పనులకు అధికారులు సహకరించాలని ఎంపీపీ కోరారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు గ్రామాల్లో నిర్వహించిన అభివృద్ధిని వివరించారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ జయకుమార్ మాట్లాడుతూ మండలంలో 10,489 జాబ్ కార్డులు అందజేసినట్లు తెలిపారు. కాలువల్లో పూడికతీత, గట్లు వెడల్పు వంటి పనులకు 8,678 మంది వరకు ఉపాధి కూలీలు వస్తున్నారని చెప్పారు. 3,53,000 పని దినాలు ఉండగా ఇప్పటికే 3,54,000 పని దినాలు పూర్తి చేసి జిల్లాలో మొదటి స్థానంలో ఉన్నట్లు వెల్లడించారు. హౌసింగ్ వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామాల్లో 23 జగనన్న కాలనీలకు 650 మంది లబ్ధిదారులు పూర్తిస్థాయిలో గృహ నిర్మాణాలు పూర్తి చేశారని వివరించారు. 502 బేస్‌మెంట్ స్థాయిలో, 70 శ్లాబ్ దశలో, 40 గృహాలు శ్లాబు వేశారని చెప్పారు. ఈఓపీఆర్డీ నిర్మల లక్ష్మీకుమారి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలును వివరించారు. వైస్ ఎంపీపీ జి.చంద్రం, ఎంపీడీఓ విలియమ్స్, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్ : మండల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాతూరు గ్రామంలో విద్యుత్ లేన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇంటి పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

ఫిరంగిపురం: ప్రతి ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి(ఎస్‌యూఓ) బి.చంద్రశేఖర్ సూచించారు. మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న స్పందన అనే మహిళకు డెంగీ జ్వరం వచ్చి గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ఆయన గురువారం డెంగీ వచ్చిన మహిళ ఇంటి చుట్టుపక్కల 80 గృహాల వారి వివరాలు సిబ్బంది ద్వారా సేకరించారు. వారికి రక్తపూత పరీక్షలు చేశారు. డెంగీ వ్యాధి లక్షణాలను వివరించారు. కొన్ని గృహాల వద్ద ఎబెట్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. ఎస్‌యూఓ వెంట సీహెచ్ఓ వెంకటరమణ, హెచ్ఎస్ కె.సుదర్శనరాజు, హెచ్ఏలు బాబురావు, బాబావలి, కిషోర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వర్ణకార్మికుడి అదృశ్యం



మంగళగిరి : పట్టణానికి చెందిన స్వర్ణకార్మికుడు అదృశ్యమైనపై కేసు నమోదైంది. పట్టణ పోలీసులు వివరాల మేరకు.. పట్టణంలోని ఆంజనేయ కాలనీకి చెందిన వంగర తేజ నాగశివరావు స్వర్ణకార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 8న రాత్రి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లిన అతను ఇంటికి తిరిగి రాలేదు. స్నేహితులను, బంధువులను విచారించిన కుటుంబ సభ్యులు.. వారం రోజులైనా నాగశివరావు ఆచూకి లభించకపోవడంతో బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మొబైల్ షాపులో చోరీ

మంగళగిరి: నగర పరిధిలో మొబైల్ షాప్‌లో గత బుధవారం రాత్రి చోరీ జరిగింది. మంగళగిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగర పరిధిలో కాజాకు చెందిన చల్లా వేణుగోపాల్‌రెడ్డి సెల్‌ఫోన్ షాప్ నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం దుకాణం తెరిచేందుకు రాగా షట్టర్ తాళాలు పగలకొట్టి ఉండటాన్ని గమనించాడు. చోరీ జరిగిందని గుర్తించి, రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దుకాణంలో సుమారు రూ.50వేల విలువైన సెల్ ఫోన్స్, ఇయర్ ఫోన్స్ చోరీ జరిగినట్లు అందులో పేర్కొన్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ పార్కింగ్ విషయంలో ఘర్షణ

తాడేపల్లిరూరల్ : పాత జాతీయ రహదారి వెంబడి పోలకంపాడు వద్ద లారీ పార్కింగ్ విషయంలో ఇద్దరు ఓనర్ల మధ్య గురువారం ఘర్షణ చోటుచేసుకోగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలకంపాడుకు చెందిన బత్తుల మోహనరావు తన ఇంటి ముందు రహదారి వెంబడి లారీని నిలుపదల చేశాడు. అదే ప్రాంతంలోని గంగాధర శ్రీను అతని లారీ వెనుకనే తన లారీని పార్క్ చేశాడు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. లారీ తీయడానికి వచ్చిన గంగాధర శ్రీనును బత్తుల మోహనరావు కర్రతో విచక్షణా రహితంగా కొట్టాడు. దీంతో వారిద్దరి కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోవడంతో.. ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో శ్రీను కొడుకు సాయి తలకు తీవ్ర గాయమైంది. అతడిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. సాయి తాడేపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఫిర్యాదు చేస్తుండగా బత్తుల మోహనరావు బంధువుల మరోసారి అతని తల్లిదండ్రులపై దాడికి పాల్పడ్డారు. సంఘటనపై ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.